క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పంచాయతీ సిబ్బందికి నగదు అందజేస్తున్న నర్సింహ

కందుకూరు: మండల పరిధిలోని మీర్ఖాన్‌పేటలో మంగళవారం గ్రామానికి చెందిన కాకి నర్సింహ పంచాయతీ సిబ్బందికి ఆర్థిక సాయం అందజేశారు. దసరా పండుగను పురస్కరించుకొని సిబ్బందికి ఆయన రూ.18 వేలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కందుకూరు డివిజన్ స్థాయిలో మంగళవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, డిస్ట్రిబ్యూటర్ సెంటర్లు, ఓటర్ లిస్టు, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఓలు సురేష్, సుధారాణి, శోభారాణి, కేశారామ్, అనిల్‌కుమార్, తహసీల్దార్లు అప్పలనాయుడు, కె.గోపాల్, ఫహీమ్‌ఖాద్రీ, సైక్‌ముంతాజ్, పి.రమేశ్, ఎంపీడీఓలు శైలజ, సరిత, కుసుమమాధురి, సుజాతానాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

చేవెళ్ల యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిరంజన్‌గౌడ్



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిరంజన్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల పరిశుభ్రతకు కార్మికుల చేస్తున్న సేవలు వెలకట్టలేనివని చేవెళ్ల యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిరంజన్‌గౌడ్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో పంచాయతీ కార్మికులకు ఆయన సొంత డబ్బులతో కార్మికులందరికీ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుత్తి బాలరాజ్, కుమ్మరి సురేష్, నర్సింహ, వెంకటేశ్, కుమార్, రాజు, శ్రీశైలం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ రైతులకు విత్తనాలు అందించారు. విత్తనాలు పొందిన రైతులు వేరుశనగ పంటను సాగుచేసి వ్యవసాయశాఖకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ కో–ఆర్డినేటర్ హరిమోహన్‌రెడ్డి, ఏఈఓలు గాయత్రి, భూదేవి, నిఖిత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ

షాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ సెక్రటరీ సాయిబాబా, ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ కోచ్ దామోదర్‌రావు ఫౌండేషన్ హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ వారి సౌజన్యంతో బాస్కెట్ బాల్ పోల్, వాలీబాల్ పోల్, ఖోఖో పోల్స్, విక్టరీ పోడియం, స్పీచ్ పోడియం, ఫస్ట్ ఎయిడ్ కిట్, పలు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. క్రీడలు శారీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.



పహాడీషరీఫ్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు



బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో దుర్గామాతను దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

దుర్గామాతగా అమ్మవారు



బడంగ్‌పేట్: అమ్మవారిని దర్శించుకున్న మాజీ మేయర్ పారిజాత, నిర్వాహకులు



తుక్కుగూడ: దుర్గామాతగా అమ్మవారు

తుక్కుగూడ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంఖాల్ మహంకాళి,రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు 9వ రోజు భక్తులకు శ్రీ దుర్గామాతగా దర్శనమిచ్చారు. భక్తులు అ మ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రావిర్యాల ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో వేద పండితులు,భక్తులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో అన్నదానం

మహేశ్వరం: మామిడిపల్లిలోని సీఐఎస్ఎఫ్ పెద్దమ్మ దేవాలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సీఐఎస్ఎఫ్ కుటుంబాలు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్, నాయకులు రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.



చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయం భవనం

స్థానిక సందడి!

- స్థానిక సంస్థల్లో ఎస్సీలకే ప్రాధాన్యత
- డివిజన్‌లో రిజర్వేషన్లు తారుమారు
- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,51,804
- 4 జెడ్పీటీసీ, 4 ఎంపీపీ, 45 ఎంపీటీసీ స్థానాలు, 109 పంచాయతీలు, 946 వార్డులు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వెల్లడించిన రిజర్వేషన్లు, ఎన్నికల షెడ్యూల్‌తో చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో ఎన్నికల వాతవారణం రాజుకుంది. డివిజన్‌లో మొదటి విడతలోనే ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఎంతో ఆశగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న ప్రస్తుత రాజకీయ నాయకుల అంచనాలు మొత్తం ఈ రిజర్వేషన్లతో తారుమారయ్యాయి. రిజర్వేషన్ల ప్రకటనతో డివిజన్‌లోని నాలుగు మండలాల్లో పాత వ్యక్తులకు ఎవరికీ అవకాశాలు రాకపోవటంతో అంతా నిరాశాలో పడిపోయారు. చేవెళ్ల ఎస్సీ నియోజకవర్గం కావటంతో పాటు ఈ స్థానిక సంస్థల్లో ఎస్సీలకే ప్రాధాన్యత లభించింది. డివిజన్‌లోని నాలుగు మండలాలకు సంబంధించి నాలుగు జెడ్పీటీసీ స్థానాలకు మూడు ఎస్సీలకే, నాలుగు ఎంపీపీ స్థానాలకు గాను మూడు ఎస్సీలకే రిజర్వు కాగా.. ఒక్క మండలంలో మాత్రమే బీసీలకు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు వచ్చాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కూడా ఎస్సీకి రిజర్వు కావటంతో చేవెళ్ల డివిజన్ జెడ్పీటీసీ స్థానాలే కీలకంగా మారనున్నాయి. డివిజన్‌లో ఇటీవలే కొత్తగా చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలుగా ఏర్పాటు కావటంతో డివిజన్‌లో ఎంపీటీసీ స్థానాల సంఖ్య కూడా తగ్గాయి. ఎంపీటీసీ స్థానాల తగ్గుదల, రిజర్వేషన్ల ప్రకటన ఈ రెండు కలిపి డివిజన్‌లో రాజకీయం మొత్తం మారిపోయింది. అన్ని పార్టీల్లో పాత నాయకులంటే కొత్త వారే ఎక్కువగా రాబోతున్నారు.

డివిజన్ వివరాలు..

చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాలకు సంబంధించి మొత్తం 45 ఎంపీటీసీ స్థానాలు, 4 జెడ్పీటీసీ, 4 ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించి చేవెళ్ల డివిజన్ పరిధిలో మొత్తం 267 పోలింగ్ స్టేషన్లు, 1,51,804 మంది ఓటర్లు ఉన్నారు. డివిజన్‌లోని నాలుగు మండలాల్లో మొత్తం 109 పంచాయతీలు, 946 వార్డులు ఉన్నాయి. చేవెళ్లలో 25 పంచాయతీలుకాగా, మొయినాబాద్‌లో 19, షాబాద్‌లో 41, శంకర్‌పల్లిలో 24 పంచాయతీలు ఉన్నాయి.

మండలాల వారీగా రిజర్వేషన్లు, ఓటర్లు

చేవెళ్ల మండలంలో జెడ్పీటీసీ ఎస్సీ, ఎంపీపీ ఎస్సీ, 10 ఎంపీటీసీ స్థానాలకు 2 ఎస్సీ(1 మహిళ), బీసీ 4(2 మహిళలకు), జనరల్ 4(2మహిళలు). మొత్తంఓటర్లు 35,438 మంది ఉన్నారు. మొయినాబాద్ మండలంలో జెడ్పీటీసీ బీసీ(మహిళ), ఎంపీపీ బీసీ, 09 ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ 2(1 మహిళ), బీసీ 4(2 మహిళలకు), జనరల్ 4(2మహిళలకు). మొత్తం ఓటర్లు 30,250 మంది ఉన్నారు. శంకర్‌పల్లి మండలంలో జెడ్పీటీసీ ఎస్సీ, ఎంపీపీ ఎస్సీ(మహిళ), 11 ఎంపీటీసీ స్థానాలకు ఎస్టీ 1, ఎస్సీ 3(1 మహిళ), బీసీ 5(2 మహిళలకు), జనరల్ 2(1మహిళలకు). మొత్తం ఓటర్లు 37,798 మంది ఉన్నారు. షాబాద్ మండలంలో జెడ్పీటీసీ ఎస్సీ (మహిళ), ఎంపీపీ ఎస్సీ, 15 ఎంపీటీసీ స్థానాలకు ఎస్టీ 1, ఎస్సీ 3(1 మహిళకు), బీసీ 6(3 మహిళలకు), జనరల్ (2 మహిళలకు). మొత్తం ఓటర్లు 48,318 మంది ఉన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించిందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజల సంక్షేమం విస్మరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఆరోపించారు.

పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నది

ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల: పోలీస్ ఉద్యోగంలో ఎంతో ఒత్తిడి ఉంటుందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఏ.బాలాజీ అన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.శంకరయ్య పదవీ విరమణ పొందగా తోటి ఉద్యోగులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అంటేనే ఒత్తిడితో ఎన్నో ఇబ్బందులతో సాగే ఉద్యోగమన్నారు. కుటుంబానికి సమయం కేటాయించటం కూడా కష్టంగా ఉంటుందన్నారు. ఇలాంటి ఉద్యోగంలోఎలాంటి రిమార్కులు లేకుండా పదవీ విరమణ పొందటం అంటేనే ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమేనన్నారు. విరమణ అనంతరం కుటుంబానికి సమయం కేటాయించి కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఏఎస్ఐ చందర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి తదితరులు

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: పట్టణంలో దసరా సంబరాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గుర్రం కేశవులు, కండె హరిప్రసాద్, వస్పుల మానయ్యలు కోరారు. బతుకమ్మ పండుగ కోసం ఆమనగల్లు హనుమాన్ దేవాలయం, గాంధీచౌక్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలు విజయవంతం చేయడానికి ఈ ఏడాది పాలకవర్గం లేకపోవడంతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో పెద్ద ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. బతుకమ్మల నిమజ్జనం కోసం చెరువు వద్ద ఘాట్ ఏర్పాటు చేశామన్నారు. దసరా రోజు రచ్చకట్ట వద్ద నుంచి కాలేజీ గ్రౌండ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ఆ తరువాత కాలేజీ గ్రౌండ్స్‌లో రావణదహనం ఉంటుందని చెప్పారు. దసరా సంబరాలు విజయవంతం చేయడానికి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు దుర్గయ్య, నర్సింహ, చెన్నకేశవులు, సాయిలు, భాస్కర్, మహేశ్, ప్రశాంత్, సిరి, ప్రవీణ్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

- అదును చూస్తారు.. దోచుకెళ్తారు..
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు
- దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు

షాద్‌నగర్: సెలవులు వచ్చాయంటే చాలూ సరదాగా ఎక్కడికైనా వెళ్లాలని అనుకుంటారు.. దసరా పండుగకు చాలా మంది బంధువుల ఇళ్లకు, స్వగ్రామాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. పండుగకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారి ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తుంటారు. దొరికిన కాడికి దోచుకొని పరారవుతుంటారు. ఇలాంటివి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసుల సూచనలివే..

సెలవులకు ఊరు వెళ్తుంటే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో నమ్మకమైన వ్యక్తిని మాత్రమే సెక్యూరిటీ గార్డుగా పెట్టుకోవాలి.


- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100కు డయల్ చేయాలి.
- ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్తే పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి తప్పనిసరిగా తాళం వేయాలి. ద్విచక్ర వాహనాల చక్రాలకు చైన్స్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడూ చూస్తుండాలి.
- ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తాచెదారం, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు, జమకానివ్వకుండా చూసుకోవాలి. వీటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి.



షాద్‌నగర్‌లో ఇటీవల చోరీ జరిగిన ఇల్లు(ఫైల్)

- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- ఇంటి డోరు తాళం వేసి కర్టన్‌ను వేయడం మర్చిపోవద్దు
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిదికాదు.

ఆభరణాలు బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి



సెలవుల్లో ఊర్లకు వెళ్లే వారు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి వారు విధిగా పోలీసులకు సమాచారం అందించాలి. ప్రతి ఇంట్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

–విజయ్‌కుమార్, సీఐ, షాద్‌నగర్ టౌన్

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో పని చేస్తున్న 140 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆయన తన సొంత ఖర్చులతో దసరా కానుకగా ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెల్లవారింది మొదలు రాత్రివరకు కార్మికులు పట్టణాన్ని శుభ్రం చేయడంలో నిమగ్నం అవుతున్నారన్నారు. వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం వంటి ఎన్నో పనులను వారు నిర్వహిస్తున్నారన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది చేసిన సేవలు ఎనలేనివన్నారు. అలాంటి కార్మికులకు అందరూ అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, జమ్రుద్‌ఖాన్, బస్వం, సర్వర్‌పాషా, ఇబ్రహీం, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

న్యాయం కోసం పోరాడితే కేసులా?



మాట్లాడుతున్న బాబయ్య

- ఎన్ని కేసులైనా పెట్టండి.. బాధిత కుటుంబాన్ని ఆదుకోండి..
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: మాపై ఎన్ని కేసులైనా పెట్టండి, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వెంకిర్యాలకు చెందిన దస్తగిరి లింగం ఆకస్మాత్తుగా వాగులో పడి మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతదేహంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా నిరసన తెలిపే అధికారం అందరికీ ఉందన్నారు. న్యాయం కోసం మాట్లాడితే పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే సమస్యలపై ఆందోళనలు, ధర్నాలు చేశారన్నారు. ఇప్పుడు అదే ఆందోళనలు మేం చేస్తే తప్పు ఏమిటని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి నిరసనలు తెలిపితే పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ తమను అక్కడి నుంచి లాక్కెళ్లడం సరికాదని ఆరోపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దస్తగిరి లింగం మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కులేకుండా పోయిందన్నారు. తాము క్యాంపు కార్యాలయంపై దాడి చేయలేదని, ఎలాంటి ఆస్తినష్టం చేయలేదన్నారు. కానీ పోలీసులు అత్యుత్సాహంతో కేసులు నమోదు చేశారన్నారు. వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో గతంలో కొందరు మృత్యువాత పడిన విషయం అధికారులు, నాయకులకు తెలియదా అని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవద్దనే ఆలోచనతో వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేని పక్షంలో పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు హరిభూషణ్ పటేల్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రశాంత్, రాధికగౌడ్, రాజు, నర్సింహాయాదవ్, మహేందర్, తిరుపతి, ముర్షద్, మురళీ, మహేశ్, కృష్ణయ్య, నర్సింహ, రాజు, శ్రీను, కుర్మయ్య, నర్సింహ్మా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి గ్రామాల్లో నాయకులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. విజయం కోసం కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులను సమాయత్తం చేయాలని సూచించారు. మంచాల మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఒంటరిగానే బరిలో ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, నాయకులు బాషయ్య, నర్సింహారెడ్డి, శ్రీశైలం, హరీష్, జనార్దన్‌రెడ్డి, పాండు, రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

భూమి లేని వారి పేర్లు తొలగించండి

హయత్‌నగర్: భూమి లేకుండా హయత్‌నగర్ రైతు సేవా సహకార సంఘంలో కొనసాగుతున్న వారి పేర్లను తొలగించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆవరణలో సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. భూములు అమ్ముకున్నవారు సైతం రైతులుగా సంఘంలో చెలామణి అవుతున్నారని పలువురు రైతులు సమావేశంలో లేవనెత్తారు. అధ్యక్షుడు కృష్ణారెడ్డి బదులిస్తూ.. భూమి లేని వారి పేర్లను తొలగిస్తామని, వారు సంఘానికి బకాయిలు ఉంటే వసూలు చేస్తామని తెలిపారు. ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్) పథకం కింద సంఘం ఎంపికైందని, ప్రతి సభ్యుడు తమ వాటా కింద రూ.2,000 చెల్లించాలని కోరారు. సీఈఓ మల్లికార్జున్ సంఘం జమా ఖర్చులను చదివి వినిపించారు.